క్లుప్తంగా

100% పన్నులు వసూలు చేయాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ప్రతి గ్రామంలో 100 శాతం ఇంటి పన్ను, నల్లా బిల్లులను వసూలు చేయాలని ఎంపీడీవో రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కారోబార్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఈ నెల చివరి వరకు పన్నులు వసూలు చేయాలన్నారు. కారోబార్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



బాన్సువాడ: బాన్సువాడ మాత శిశు సంరక్షణ కేంద్రంలో మంగళవారం అవిజ్ఞ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసిన వారవుతారని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన 32 మంది యువకులకు ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు. అన్ని దానాలకంటే రక్తదానం చాలా గొప్పదని అన్నారు. అనంతరం డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డిని ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ శివదాస్, నర్సింగ్ ఆఫీసర్ వెన్నెల, పీఆర్‌వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, రాఘవేందర్, జ్ఞానేశ్వర్, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి 43వేల 108 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను మరింత పెంచాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. రాఘవపల్లి గ్రామశివారులో చేపట్టిన ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం కొలతలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని ధర్మారెడ్డి శివారులో గల హరితవనాలలో చేపట్టిన గడ్డిని తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. హరితవనాలలోని మొక్కల చుట్టూ పాదులను చేయాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు క్రిష్ణమూర్తి, సత్యనారాయణ, ఫీల్డ్అసిస్టెంట్ మంగమ్మ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దోమకొండ: కామారెడ్డి మండలం రాఘవపూర్ తండాలో జై సేవాలాల్ ఆలయ నిర్మాణానికి మంగళవారం దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ముత్తగారి శిరీష్ గౌడ్ విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ పనులకు ఆర్థిక సహకారం అందించాలని తండావాసులు కలిసి కోరగా.. రూ.30 వేలు అందించినట్లు ఈ సందర్భంగా శిరీష్‌గౌడ్ తెలిపారు. తన తండ్రి సాయాగౌడ్ జ్ఞాపకార్థం తమ్ముడు రాహుల్‌గౌడ్‌తో కలిసి విరాళం అందజేశామన్నారు.

ప్రతిభా పురస్కారం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి జెడ్పీ పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వర్తిస్తున్న అయ్యవారు మురళి మంగళవారం హరిదా రచయితల సంఘం ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో దేవేందర్, నరేష్ తదితరులున్నారు.

స్వల్ప తేడాతో ఓడి.. భారీ మెజార్టీతో గెలిచి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుత ఎన్నికల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన మదన్‌మోహన్‌రావు గతంలో స్వల్ప మెజార్టీతో ఎంపీగా ఓడిపోయారు. మదన్‌మోహన్‌రావు 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానం నుంచి కాంగ్రెస తరఫున పోటీ చేశారు. అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ చేతిలో 6,229 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆయన ఇటీవల కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఈ ఎన్నికలో మదన్ మోహన్‌రావు బీఆర్ఎస్ అభ్యర్థి సురేందర్‌పై 24,001 మెజార్టీతో గెలుపొందారు.

రేవంత్ ఎంపికపై కాంగ్రెస్‌లో హర్షం

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం సీఎంగా ఎంపిక చేయడంపై జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్త లు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. – మాచారెడ్డి/నిజాంసాగర్/భిక్కనూరు



మంగ్లూర్‌లో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



మాచారెడ్డిలో..



భిక్కనూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మౌలిక వసతులు ఉండేలా చూడాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): అన్ని పాఠశాలలో మౌలిక వసతులు ఉండేలా చూడాలని ఎంఈవో రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మంగళవారం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలో మౌలిక వసతుల వివరాలను ఫాంలో నింపి తమకు అందజేయాలన్నారు. ప్రతిరోజు విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు సంగారెడ్డి, కళ్యాణి, రమేష్, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



తాడ్వాయిలో మాట్లాడుతున్న ఎంఈవో

మట్టి రోడ్డును బీటీగా మార్చండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల వరకు ఉన్న రోడ్డును బీటీరోడ్డుగా మార్చాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ రోడ్డులో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయని, రాత్రివేళలో గుంతల్లో పడి ద్విచక్రవాహనదారులు గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయన్నారు. కొద్దిపాటి వర్షం పడితే చాలు వాహనాలు జారిపోతున్నాయన్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డు గుండా వెళ్లడానికి విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, గమనించి ఈ రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్నారు.

పాఠశాలల వివరాలు నమోదు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలు యు–డైస్ ప్లస్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి రామస్వామి సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేయాలన్నారు. యు–డైస్ ప్లస్‌లో చేసిన వివరాల ఆధారంగానే విద్యార్థులకు మౌలిక వసతులు, గ్రాంట్లు, ఉపాధ్యాయుల కేటాయింపు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు, తరగతి గదులు మంజూరు అవుతాయన్నారు. సమయపాలన పాటించి సకాలంలో రిపోర్టులు ఎమ్మార్సీకి అందజేయాలని సూచించారు. మండల నోడల అధికారి శౌకత్ అలీ, ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ స్వప్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

దళితులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి



కామారెడ్డి టౌన్: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని దళితులను ఆదుకోవాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దళితులను చిన్న చూపు చూడకుండా డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు 19 శాతం రిజర్వేషన్‌ను రాజకీయంగా ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు.

రైతులు మట్టి పరీక్షలు తప్పక చేయించుకోవాలి

బాన్సువాడ : నేలలో లభ్యమయ్యే పోషకాలు తెలుసుకోవాలంటే రైతులు మట్టి పరీక్షలు తప్పక చేయించాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం బీర్కూర్ రైతు వేదికలో ప్రపంచ నేల(మృత్తిక) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి మీద ఉన్న సమస్త జీవరాశులకు మట్టి జీవనాధారమని, మనుషులు తీసుకునే ఆహారంలో 95 శాతం మట్టి నుంచి వచ్చిందేనని, మిగత 5 శాతం సముద్రాలు, నదులు మొదలైన వాటి నుంచి వచ్చాయని అన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 5న ప్రపంచ నేల దినోత్సవం జరుపుతారని అన్నారు. భూమి రక్షణ, సమతుల్యత, పరిరక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. మనుషులకు రోగాలు వస్తే వ్యాధి లక్షణాలు గుర్తించేందుకు రక్త పరీక్షలు ఎలా చేస్తారో.. అలానే నేలలో లభ్యమయ్యే పోషకాలు తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలు చేయాలన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

ఎమ్మెల్యే కేవీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్/భిక్కనూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్)కి మంగళవారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా కులసంఘాల ప్రతినిధులు, అయ్యప్ప మాలధారణ స్వాములు, జర్నలిస్టులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులు, టీఎన్జీవోస్ నేతలు, ఆయా గ్రామాల నుంచి బీజేపీ కార్యకర్తలు తరలివచ్చి ఘనంగా శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



సన్మానిస్తున్న టీఎన్జీవోలు



సన్మానిస్తున్న రామేశ్వర్‌పల్లి వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి..



అయ్యప్ప మాలధారులు

'బీఆర్ఎస్ వద్ద తీసుకున్న డబ్బులు పంపిణీ చేయాలి'

కామారెడ్డి అర్బన్: శాసనసభ ఎన్నికల్లో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సయ్య, వర్కింగ్ అధ్యక్షుడు ఐరేని నర్సయ్య, ఇతర నాయకులు కొందరు పద్మశాలీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ పార్టీకి తాకట్టు పెట్టారని, డబ్బులు తీసుకున్నారని సంఘం జిల్లా కార్యదర్శి బొమ్మరి భూమేష్, సహాయ కార్యదర్శి ఇంజమూరి శ్రీనివాస్‌లు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నేతల వద్ద తీసుకున్న డబ్బులను గ్రామాల వారీగా తిరిగి పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనాకి జిల్లా నాయకులు గైర్హాజరు అయినప్పటికి మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో తాము నిర్వహించిన సమ్మేళనానికి పట్టణం, నియోజకవర్గంలోని పద్మశాలీలు హాజరై విజయవంతం చేశారని సంఘం నాయకులు భూమేష్, శ్రీనివాస్‌లు వెల్లడించారు.

వైభవంగా వీరభద్రుడి వేడుకలు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని వీరభద్రప్ప ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో వీరభద్రుడి కల్యాణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకుడు సంగాయప్ప తెలిపారు. మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి తర్వాత 8న ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేడు అగ్నిగుండం

వీరభద్రుని ఉత్సవాల సందర్భంగా బుధవారం దశయజ్ఞం (అగ్నిగుండం) నిర్వహించనున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు నిప్పు కణికలపై నడిచి తమ భక్తిని చాటుకుంటారన్నారు. ప్రత్యేక పూజలు చేసి అగ్ని గుండంలోంచి అడుగులు వేస్తూ భక్తులు కోరికలను కోరుకుంటారని ఆయన చెప్పారు.



మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని కొచ్చరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు మైసమ్మ తల్లికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దివిటి శ్రీనివాస్, భక్తులు భాస్కర్‌రావు తదితరులున్నారు.

వంద రోజుల్లో హామీలు నెరవేర్చాలి

- కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓటేశారు
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధించాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బాణాల లక్ష్మారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వంద రోజుల్లో అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 2018 కంటే మెరుగైన ఫలితాలు సాధించి ఎనిమిది అసెంబ్లీ సీట్లను గెలుచుకున్నామన్నారు. అలాగే 19 చోట్ల రెండో స్థానంలో బీజేపీ నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు ఓటేశారని, ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చకపోతే ప్రజల తరఫున అండగా ఉండి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 15 సీట్లను తప్పకుండా కైవసం చేసుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం ఈ నెల 25 నుంచి మాచారెడ్డి నుంచి జహీరాబాద్ వరకు ఏడు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహుమతిగా ఇస్తామన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు బుడిగె నర్సింహారెడ్డి, నాయకులు జనగామ ప్రభాకర్‌రెడ్డి, కొప్పుల గంగారెడ్డి, సంకరి విఠల్, సురేందర్ రెడ్డి, సాయిరెడ్డి, మోహన్‌రాజ్, సాయిరెడ్డి, వేణు, శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశాన్ని చైర్మన్ కాశీ నారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జులై, ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన ఆదాయ, వ్యయాల లెక్కలను కార్యదర్శి దూమ్‌డా నాయక్ చదివి వినిపించారు.

రానున్న రోజులలో చేయనున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సిద్దిరాంరెడ్డి, డైరెక్టర్లు తదితరులున్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కాశీ నారాయణ

పొంచి ఉన్న ప్రమాదం

మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వద్ద కుర్మగల్లీకి వెళ్లే మూల మలుపు వద్ద కల్వర్టు ధ్వంసమై నెలలు గడుస్తోంది. రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైె ఘటనలు ఉన్నాయి. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ దృష్టి సారించడం లేదు. భారీ ప్రమాదాలు జరగక ముందే కల్వర్టుకు మరమ్మతులు చేయించి ప్రమాదాల భారీ నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సదాశివనగర్(ఎల్లారెడ్డి)



సదాశివనగర్‌లో పాత పోస్టాఫీస్ వద్ద ధ్వంసమైన కల్వర్టు

పోచారంను కలిసిన బీఆర్ఎస్ నేతలు

బాన్సువాడ: బాన్సువాడ ఎమ్మెల్యే, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం బాన్సువాడకు చెందిన పలువురు నేతలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించగానే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లడంతో చాలా మంది నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపేందుకు వీలు పడలేదు. సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలవడంతో స్పీకర్ బిజీబిజీగా గడిపారు. ఉదయం నుంచే నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు హైదరాబాద్‌కు వెళ్లేందుకు క్యూ కట్టారు. పోచారంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అలుగెల్లితే రాకపోకలకు ఇబ్బందే



నస్రుల్లాబాద్‌లో రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో పాతూరు, ప్రధాన రహదారిని వేరుచేస్తూ గ్రామ చెరువు అలుగు పారుతుంటుంది. అయితే గ్రామ చెరువు నిండితే అలుగు నుంచి నీరు నిండుగా వస్తాయి. దీనితో ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుంది. ప్రతి వర్షాకాలం ప్రజల ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. సరైన కల్వర్టు నిర్మించాలన్న ఆలోచన మాత్రం రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న భవనాలకు నిధులు మంజూరు చేసుకుంటున్న పాలకులు కల్వర్టుకు నిధులు మంజూరు చేసి వచ్చే వర్షాకాలం వరకు కల్వర్టును నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవు

గ్రామం మధ్యలో ఉన్న ఈ కల్వర్టుకు రక్షణ గోడలు సైతం లేకపోవడంతో పలుమార్లు సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. రక్షణ గోడతో కూడిన కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.